

# అందరూ అందరే!

ఈశ్వర్

మాధవరావు చాలాసేపు తిరిగాడు।

తిరిగి, తిరిగి తిరిగిన చోటుకే తిరిగిరావడంతో, ఇక తిరగడానికి స్థలం లేదని – తిరుగుముఖం పట్టాడు.


అసలు ఆ వూరే చిన్నది. ఇద్దరు ముగ్గురు జమీందారుల భవనాలు, కొన్నిరకాల వ్యాపారాలు, ఒక ఫ్లోర్ మిల్, రెండు టెంటు సినిమాలూ, ఒక బస్సుల కంపెనీ హెడ్ ఆఫీసూ, ఒక ఎలిమెంటరీ స్కూలూ, రైలుస్టేషన్, రెండు కొండలూ, మామూలు ఇళ్ళూ, చెట్లూ, చేమలూ, పొలాలూ... ఇంకేమీ గొప్పతనంలేదు. 'ఇచ్ఛాపురం' ఉండటానికి ప్రజలూ – ప్రజలు ఉండటానికి 'ఇచ్ఛాపురం' ఒక ఒప్పందం చేసుకున్నట్లు కనబడింది మాధవరావుకు.

టైమ్ చూసుకున్నాడు. పదిగంటల ఇరవై నిమిషాలయింది. ఆ వూళ్ళో దింపిన తనఖర్మను తానే తిట్టుకుంటూ సత్రంలోని తన గదికి ప్రవేశించబోయి చటుక్కున ఆగాడు

'మిగిలిన మూడుగదులూ – నిన్న సాయంత్రం ఖాళీ అయినవి – ఇప్పటికి భర్తీ అయ్యాయన్నమాట'... కొంచెం సందడిగా కనబడిన గదులను చూస్తూ అనుకున్నంతలో ... 'ఆఫీసు రూమ్' తాళం వేస్తూ బయటికి వెళ్తున్న సత్రం గుమాస్తా కనబడ్డాడు.

'ఇహిహి' అంటూ 'విష్' చేసి, "ఎండలో బయలుదేరుతున్నారే!" అని సానుభూతి నిట్టూర్పు విడిచాడు.

"అవునండీ...! ఇంటిదగ్గర కొంచెం పనిఉంది అదీగాక కొత్తవాళ్ళ పని అయిపోయిందిగదా! మళ్ళా రాత్రికే



అద్దెకున్నతను : "చూడండి యింటికప్పంతా పాడయిపోయింది. వర్షమంతా మా నెత్తిమీదే వుంది. ఎంతకాలం యిలా అవస్థపడాలి ?"

ఇంటాయన "నేను ఎలా చెప్పగల నీ వర్షాలు యింక ఎంతకాలం వుంటవో!"

---

రావడం. ఈ లోగా ఖాళీ చేస్తే తాళం చేతులు పక్క ఇంటిలో ఇచ్చేస్తారు. ఇక నే నెందుకు?" ... గట్టిగా నవ్వాడు గుమాస్తా.

అందులోని జో కేమిటో అర్థం కాకపోయినా, తప్పనిసరిగా మాధవ రావుకూడా నవ్వాడు. 'ధర్మసత్రం' అని పేరు ఉన్నా, గదులకు మామూలు వసూలు చేసే దుర్మార్గుడని లోలోపల చాలా కోపం వుంది.

పైకిమాత్రము చాలా సరదాగా నవ్వినట్లు నవ్వి "మంచివాళ్ళేకదా!" అన్నాడు వినయంగా. వివరాలు తెలుసుకోవాలని లోలోపల కుతూహలం.

"అలాగే కనిపించారు మరి!"... కళ్ళజోడు సర్దుకుంటూ... ఒక ప్రక్క విరిగిన భాగానికి దారాన్ని సరిచేసుకుంటూ అన్నాడు.

"ఒకాయన వ్యాపారస్తుడు... డబ్బున్నవాడిలా వున్నాడు. రెండో మనిషి సేల్సుఏజంట్ కాబోలు– చెప్పాడు. ఇక మూడవది...

"ది"... ఆశ్చర్యంగా చూశాడు మాధవరావు. 'కుర్రవాడి' తరహా

చూసిన గుమాస్తా మరింత సరదా చూపించాడు.

"...ఆ ..'ది'...ఆడది...పాపం! కుర్రవయసులోనే ఉంది ... శ్రీమంతుల పిల్ల కాబోలు... బంధువు లెవరూ లేకుండా ... ఈ వూళ్ళో ... అందులోనూ సత్రంలోకి ఎందుకు వచ్చిందో తెలియదు. ఏ గొడవా జరగకుండా ఉంటే, అదే పదివేలు...అ( .అన్నట్లు మీరు... వచ్చి... రెండురోజు లయినట్లుంది...మీపనులు ఇంకా జరగలేదు."

వార్నింగ్ ఇస్తున్నట్లుగా చెప్పాడు సత్రం గుమాస్తా!

"జరుగుతున్నాయండి మరి... జరగకపోతే .. జరుగుబాటు... ఎలా జరుగుతుంది," అన్నాడు మాధవరావు నవ్వుతూ, ఆ గదులవైపు దిక్కులు చూస్తూ.

గుమాస్తా నవ్వకుండానే వెళ్ళిపోయాడు మాధవరావు తన గదికి వస్తూ ముందున్న రెండుగదులవైపు చూశాడు.

మొదటిగదిలో ఎవరో మధ్యవయస్కుడు కాబోలు పేపరు చదువుకుంటున్నాడు రెండవగదిలో ఒక లావుపాటి మనిషి మంచంమీద వెల్లకిలా పడుకొని కాలుమీద కాలు వేసుకొని ఆ గదికి ఉన్న వాసాలు లెక్కపెట్టుకుంటున్నాడు.

తనగది వదిలిపెట్టి తెరిచిఉన్న నాల్గవ గదిలోకి రెండడుగులు వేసి 'ఆమె'ను చూశాడు.

"సారీ...అయామ్ వెరీసారీ! పరధ్యానంలో వచ్చేశానండీ," అన్నాడు మాధవరావు. ఆమె అతన్ని చూసింది.

"నడుస్తున్న రైలులోంచిమాత్రం పరధ్యాన్నంగా దిగకండి," అంది... అదోలా అతనివైపు చూస్తూ.

ఆ చూపులు అమాయకంగా కనిపించాయి మాధవరావుకు.

గట్టిగా నవ్వాడు. "భలేమాట అన్నారండీ;" నవ్వుతూ - నవ్వాపుకోనట్లు నవ్వుతూ ఓక్షణం ఆమెను పరిశీలించాడు.

చేతికి మెరుస్తున్న ఉంగరాలూ, బంగారపు గాజులూ, మెడలో ఒక నెక్లెసూ, చెవులకు అందంగా మెలికతిరిగిన స్టడ్స్. గులాబీరంగు పువ్వుల వాయిల్ చీర, అదేరంగు జాకెట్ తో చామనచాయగా - యవ్వన చాయగా, 'కొండపల్లి బొమ్మ'లా ఉందనుకొన్నాడు. దగ్గర్లో ఒక సూట్ కేసూ, మంచంమీద చిందరవందరగా ఉన్న బట్టలూ, దగ్గర్లో మూడు సినిమా పుస్తకాలూ, ఆమె తీరూ ఆమె ధనికురాలు అయివుండవచ్చునని చెప్పకనే చెబుతున్నాయ్.

అంతగా అందం లేకపోయినా విపరీతమైన ఆకర్షణఉంది ఆమెలో. "అలా అయినాకూడా ఫరవాలేదండీ! ఇల్లువదిలి పారిపోకుండా ఎంచక్కా స్వర్గంలో హాయిగా ఉండేవాడిని," అన్నాడు నిట్టూరుస్తూ. దగ్గర్లో ఉన్న సినిమాపుస్తకం పేజీలు తిరగేస్తూ.



"అరెరే... ఇల్లువదిలి పారిపోయి వచ్చారా!" ఆశ్చర్యంగా అంది ఆమె.

దాదాపు ఇరవై సంవత్సరాల భారీ మనిషి అందంగా, 'టిప్ - టాప్' గా కనబడుతూన్న యువకుడు, ఇల్లువదిలి పారిపోవడం చిత్ర మనిపించింది.

"అవునండీ! నమ్మలేని నిజం;" దగ్గరగాఉన్న స్టూల్వైపు ఆశగాచూశాడు కూర్చోమంటుందేమోనని.

"కూర్చోండి," అంది. థాంక్స్ చెప్పాడు.

"మీరే చెప్పండి. బి. ఏ. పాసయ్యాను. వెయ్యవలసిన దరఖాస్తులన్నీ వేశాను. వసుదేవుడు ఒక గాడిదకాళ్ళే పట్టుకున్నాడు; నేను బోలెడు గాడిదలకాళ్ళు పట్టుకున్నాను. ఏం లాభం? ఆ కాలంలోని గాడిదయినా వసుదేవుడ్ని అర్థం చేసుకుని ఉంటుంది!... ఈరోజుల్లో ఏ అడ్డగాడిద అర్థం చేసుకుంటుందండీ!

"ఉద్యోగం సంపాదించుకోడం చేతగాక తేరగా ఇంట్లో తింటున్నానట - స్వంత తండ్రే అంతంత మాటలంటే నాలాంటి ఆత్మగౌరవం, మొండితనం - పట్టుదల గలవాడు ఎలా సహించగలడండీ!

వచ్చేశాను. ఒక లెదర్‌బాగ్‌లో నాబట్టలు వేసేసుకొని చెప్పాచెయ్యకుండా రైలెక్కి— ఇచ్ఛాపురంలో ఉద్యోగం చేస్తున్న ఒక ఫ్రెండును చూడడానికి వస్తే, వాడుకాస్తా ఎక్కడికో 'ట్రాన్స్‌ఫర్' అయి కూర్చున్నాడు. అరరే ఏమిటిది — అనవసరంగా నాకథ చెప్పి మీకు బాధ కలిగిస్తున్నాను." నాలుక కొరుక్కున్నాడు మాధవరావు.

"ఏమిటో...మీ మొహంలో కనబడ్డ ఆప్యాయతా, ఆదరణా నాచేత అలా చెప్పించాయి ... 'కర్చీఫ్'తో మొహం తుడుచుకున్నాడు.

"అబ్బేబ్బే! బాధేమీ లేదండీ! మీలా 'ఫ్రీ'గా మాట్లాడేవాళ్ళంటే నాకెంతో ఇష్టం! అంతెందుకు ? నాసంగతి చూడండి! నేనూ కొద్దోగొప్పో నా కిష్టంలేని — వాడితో పెళ్ళి చెయ్యాలని పెద్దలు నిర్ణయించారు. హుఁ, పెద్దలు సుద్దలు మొద్దులు— నేనెలా సహిస్తాను చెప్పండి. పెళ్ళి చేసుకొని వాడికోసం 'వ్యక్తిత్వం' చంపుకొని జీవచ్ఛవంలా బ్రతకడం నా కిష్టంలేదు. అందుకనే ఎవ్వరికీ తెలియకుండా మద్రాసునుండి బరంపురానికి — టిక్కెట్టు తీసుకొని ఈ వూరు బాగా ఉండటం చూసి ఇక్కడే దిగిపోయాను. నన్ను 'సుధారాణి' అంటారు లెండి." అన్న దామె.

ఆమెకథ విని మాధవరావు నిశ్చేష్టుడయ్యాడు; తర్వాత తమాయించుకున్నాడు.

"ఫరవాలేదు! ఈమెతో కొంతకాలం కాలాన్ని దొర్లించవచ్చు" ననుకుంటూ బాధగా 'ప్చ్' అని నిట్టూర్చారు

"మీ రేమీ ఆందోళనపడకండి! ఇఫ్ యూ డోంట్ మైండ్ — మీరూ నేనూ — ఒకరి కొకరం—తోడుగా ఉందాం! నేను మీకు — 'ఫ్రెండ్' లాంటివాడ్ని. మీ కే అపాయం రాకుండా చూసేబాధ్యత — నాది. నన్ను నమ్మండి;" ధీమాగా — భరోసాగా చెప్పాడు మాధరావు.

'అవును; ఇతని 'అండ' ఉంటే ఏమన్నా సాధించవచ్చుకూడా;' అమె మనసులో అనుకొంది. "చాలాథాంక్స్! మీలాంటి సహృదయులు నాకు మిత్రులవడం చాలా సంతోషంగాఉంది." అన్నదామె నవ్వుముహం కనబరుస్తూ.

"అన్నట్లు సత్రం గుమాస్తాకు ఎం తిచ్చారు;" మాధవరావు అడిగాడు.

"మీ ఇష్టం ... ఇష్టం . అంటూ గొణిగితే రెండు రూపాయలు తీసి ఇచ్చాను. ఇంకోలావుపాటి మనిషి నా తర్వాతే వస్తూ అయిదు రూపాయలిచ్చాడు జేబులోంచి 'డబ్బు' తీస్తే వంద నోట్లూ — పదినోట్లూ... అబ్బ! చాలా డబ్బు! నేనే మగాడినయితేనా — చాటుగా నెత్తిమీద ఒక్కదెబ్బ కొట్టి, డబ్బంతా లాక్కొనేదాన్నే;" అని తమాషాగా

నవ్వుతూ... మెంకెగా మాధవరావువైపు చూసింది.

మాధవరావు ఉలిక్కిపడి — తర్వాత 'సరదాకే' అన్నదనుకొని — సర్దుకొని నవ్వాడు. "తమాషాగా మాట్లాడుతా రండీమీరూ!"

"..ఆఁ, అన్నట్లు నేను వెళ్ళి మన మధ్యాహ్న భోజనానికి ఏదైనా మంచి హోటలు చూసి 'రిజర్వ్' చేసేసి ... వస్తాను. అసలే ఇది పల్లెటూరు — మనం ముందే జాగ్రత్త పడకపోతే తర్వాత కష్టం," అన్నాడు మాధవరావు

"అవునవును చూడండీ — ఇదిగో పది రూపాయలు దగ్గర ఉంచుకోండి," అంది సుధారాణి దగ్గరకు వస్తూ.

"భలేవాళ్ళే! నాదగ్గర డబ్బు లేదను కున్నారా! జేబులో డబ్బులేకుండా మాధవ రావు ఎప్పుడూ ఉండడు," అన్నాడు కులాసాగా.

"ఫరవాలేదు ఉంచండి;" ఆమె నోటు అతని పై జేబులో ఉంచబోయింది!

"అరరే వద్దండీ!" ఆమె చెయ్యి పట్టుకుని దించేసి ఆమెవైపే చూస్తూ — 'సారీ' అన్నాడు దీనంగా.

"ఫరవాలేదులెండి," ఆమె చెయ్యి వెనక్కి లాక్కుని "మీ ఇష్టం" అంది.

మాధవరావు బయటికి వచ్చాడు.

అతనికి చాలా ఆనందంగా ఉంది. మొట్టమొదటి పదినిమిషాల పరిచయం లోనే ఇంత విజయం లభిస్తుందని అను కోకపోవడంచేత చాలా సంతోషంగా వుంది.

పర్సులోంచి పదిరూపాయల నోటు తీశాడు. వ్యాపారస్తునితో పరిచయం చేసుకోవాలని కుతుహలం కలిగింది.

"క్షమించాలి! ఒక్క పదిరూపాయల చిల్లర ఉంటే ఇప్పిస్తారూ," ఆశగా చూశాడు ఆ ఆసామివైపు.

"తప్పకుండా," లేచి దిండుక్రింద ఉన్న రూపాయనోట్లు లెక్కబెట్టసాగాడు.

"ఏమిటోనండీ! ఈ పల్లెటూళ్ళో ప్రతీదీ కష్టంగానే ఉంది. ఆవిడకు 'హెయిర్ ఆయిల్' కొనాలంటే ఎక్కడా మంచిది కనబడలేదు. ఇక భోజనాలు అవీ ఎలా అవుతాయో!" అంత అందమైన అమ్మాయి తన సంరక్షణలో ఉందని చెప్పుకోవడంలో — అందమైన అబద్ధాలు ఆడడంలో మాధవరావుకు మరింత సరదా కలిగింది.

"అవునండీ! బొత్తిగా పల్లెటూరు కాక పోయినా, దేనికైనాసరే బరంపురం వెళ్ళాల్సిందే. పది నోట్లిచ్చి పదిరూపా యలనోటు తీసుకున్నాడు ఆసామి.

బయటికి వస్తూ మొదటి గదిలోకి తొంగిచూశాడు మాధవరావు.

"ఏం కావాలండీ" లోపలినుండి మధ్య వయస్కుడు ప్రశ్నించాడు — అతని మంచం మీద బట్టల శాంపిల్స్, పుస్తకాలు, కాగి తాలు ఏవేవో పడివున్నాయ్.

"అబ్బే! ఒక్క రూపాయి చిల్లర;"

గబుక్కున చెప్పి చమత్కారంగా తప్పించుకున్నా ననుకున్నాడు.

"చిల్లర లేదుగాని రెండు అర్ధరూపాయ లున్న ట్లున్నాయ్; చూస్తా నుండండి!" తన జేబులు వెదుకుతూ మాధవరావునే నిశితంగా చూస్తూ, రెండు అర్ధరూపాయ లిచ్చి రూపాయినోటు తీసుకున్నాడు."

మాధవరావు 'విజిల్' వేసుకొంటూ బయటికి వచ్చి, కంటికి క్రొత్తగా కన బడినట్లున్న 'ఇచ్ఛాపురం'ను చూస్తూ బజారులోనికి నడిచాడు.

* * *

దాదాపు రెండుగంటలకు సుధారాణితో భోజనాలు అయ్యాక తనగదిలోకి వచ్చి మగతగా మత్తుగా పడుకున్నాడు మాధవ రావు. అతని కలల్లో లీలగా సుధారాణి, కనకలక్ష్మి, ధనలక్ష్మి, మోహనలక్ష్మి మరి-మరి కనబడుతూ మాయమవుతూ ఉన్నారు

"ఏమండీ! ఏమండీ!" తన భుజాలను గట్టిగా ఎవరో కదపడం తెలుసుకొని ఉలిక్కిపడిలేచాడు మాధవరావు. ఎదు రుగా సిగ్గు నభినయిస్తూ 'సుధారాణి'.

"మరేంలేదు. ఆ ప్రక్క గదాయన - అదే ఎవరో 'బిజినెస్ మెన్' అని అనుకో లేదూ! ఆయన నా గదికి వచ్చి మిమ్మల్ని అడిగారు. మనం ఇద్దరం-అదే-ఒకటను కొని మిమ్మల్ని పిలవమన్నాడు. ఆయన చేతిలో రెండుపేలరూపాయలకు రెండు పది-కట్టలు ఉన్నాయ్! అవకాశాన్ని పోగొట్టుకోకూడదు - రండి;" మెల్లిగా చెప్పి తొందర పెట్టసాగింది.

నిద్రమత్తులో అర్థం కాకపోయినా ఆమెవెంటనే వెళ్ళాడు గదిలోనికి!

"చూడండి మిస్టర్! నాకు మీరు పూర్తిగా కొత్తఅయినా మీ మీద నమ్మకము వుంచి మీకు కొంచెం శ్రమ కలిగిస్తున్నాను. అదీగాక మేడమ్‌గారూ చెప్పారు - రెండు రోజులవరకూ ఈ వూళ్ళోనే ఉండాలని అనుకున్నా రని...అందుకని......ఏమీలేదు. నాకు అర్జంటుగా బయటికి వెళ్ళే పనివుంది. ఎక్కడికి వెళ్ళినా ఎవరో నీడల్లా నా వెంటనే వుంటున్నారు. నాకు చాలా భయం వేస్తూవుంది. పైగా రెండు వేలకుపైన నా దగ్గర డబ్బుండడంచే... మీరే చెప్పండి! దయచేసి మీ రీ డబ్బు ఈరోజువరకు జాగ్రత్త చేస్తే, రేపు ప్రొద్దున్నే వచ్చి తీసుకు వెళ్ళిపోతాను." ప్రాధేయ పడ్డాడు పెద్దమనిషి.

సుధారాణీవైపు చూశాడు మాధవ రావు. 'తీసుకో' మన్నట్లు కనుసైగ చేసింది.

ఇంత డబ్బు మా దగ్గర ఉన్నాకూడా ప్రమాదమే కదండీ!" నసిగాడు మాధవరావు.

"అబ్బే! ఏం ప్రమాదమూ లేదు. అయినా మీరు బయటి కేం వెళ్తారు. వెళ్ళినానూ, 'మీ దగ్గ రింత డబ్బు వుంటుందని ఎవరనుకుంటారు చెప్పండి!



మీ రీ సహాయం తప్పనిసరిగా చెయ్యాలి;" మాధవరావు చేతులు పట్టుకున్నా డతను.

"సరే," మెరుస్తున్న రెండు నోట్ల కట్టలూ తీసుకున్నాడు. నెంబర్లు సీరియల్ ఆర్డరులో రెండువందలకు పది-నోట్లు సరిగ్గానే వున్నాయి. — మాధవరావుకు చేతులు వణికాయ్!

'థాంక్స్' చెప్పి ఆయన బయటికి వెళ్ళిపోయాడు. కొన్ని నిమిషాలకు తలుపులు తాళం వేసిన చప్పుడు వినబడింది.

"ఏమిటి సుధా! ఈ తలనొప్పి మనకు! ఎందుకు తీసుకున్నావ్!" విసుగ్గా అడిగాడు.

"భలేవాళ్ళే- తలనొప్పా! ఎంచక్కా రెండువేల రూపాయలు చేతిలో వుంటే!"

"మన దేమిటి ఈ డబ్బంతా?"

"గుండె ధైర్యం వుంటే మనది కావడానికి ఎంత సేపు పడుతుంది!"

"అంటే?"

"ఇంకా తెలియదా!" చెవి దగ్గరకు వచ్చింది సుధారాణి

"ఏడుగంటల బండికే మనం ప్రయాణము కట్టేద్దాం!"

"అమ్మ బాబోయ్! ఇంత డబ్బు పట్టుకొని పారిపోవడమే- పట్టుకుంటే?"

"డబ్బు మన కిచ్చాడని ఏముంది సాక్ష్యం! అయినా మన మెక్కడ దొరుకుతాం. ఇతను రేపుదయం 'ఇచ్చా

పురం' లోనూ, మనం కలకత్తా సరి హద్దులలోనూ ఉంటాం;" భుజా లెగ రేసింది సుధారాణి.

"నాకు భయంగా వుంది సుధా!" సుధారాణి ప్రవర్తన అతనికి విచిత్రంగా కనబడసాగింది.

"వట్టి పిరికివాళ్ళలాగా వున్నారే మీరు. ఇంతేనా మీ ధైర్యం-మొండి తనం అని చెప్పారు," అంది వెక్కి రింపుగా.

'ఛీ, ఒక ఆడది- అందులోనూ సుధా రాణి లాంటి అమ్మాయి తనను ఇలా అనడమా!?'

మాధరావుకు రోషం కలిగింది.

*　　*　　*

ఆరుగంట లయింది. చీకటితెరలు ఇచ్ఛాపురంపై ఇష్టం వచ్చినట్టు పడ సాగాయి. మాధవరావు సత్రంలోనికి వచ్చాడు. మొదటి రెండు గదులూ తాళం వేసే వున్నాయ్. బయట ఎవరి అలికిడీ లేదు.

"సుధా! అన్నిచోట్లా వెదికాను. ఆ పెద్దమనిషి ఎక్కడా కనబడలేదు ఆ ఏజంటు మాత్రం ఏదో ఒక బట్ట షాపులో కూర్చుని ఎవరితోనో మాట్లాడు తున్నాడు," చెమటలు తుడుచుకుంటూ అన్నాడు మాధవరావు.

"రైట్. ఏజంటు సంగతి మన కెందుకు లెండి. సూట్‌కేసూ, మీ లెదర్ బాగ్ సర్దేశాను. ఆ రెండు నోట్లకట్టలూ నా సూట్‌కేస్‌లోనే పెట్టాను - ఎందు కయినా మంచిదని. మనం ఇటువైపే సందుల మధ్యనుంచి నడిచి స్టేషన్‌కు చేరుకుందాం. బస్సులో బరంపురం పోవడంకూడా ప్రమాదమే. అతను రేపు వస్తాడు. కాబట్టి మనం రైలులో వెళ్ళడమే మంచిది. మన జాగ్రత్తలో మనం వుండాలి. గదుల తాళాలు వేసేసి, తాళంచెవులు మాత్రం ఎవరికీ ఇవ్వ కుండా ఎక్కడన్నా పెట్టేయండి."

సుధారాణి తెలివితేటలకు మాధవ రావు ఆశ్చర్యపడుతూ, "అలాగే, అలాగే," అని అన్నిపనులూ ముగిం చాడు.

ఇద్దరూ చీకటి నీడల్లో, చీకటిని వెదుక్కుంటూ పోసాగారు


మాధవరావుకు లోలోపల కలవరంగా వుంది. సుధారాణి చూసినప్పుడుమాత్రం ధైర్యంగా వున్నట్లు 'ఇహిహి' అన సాగాడు.

దూరంగా స్టేషను లైట్లు మసక మసకగా కనబడుతూవున్నాయ్.

ఒక చిన్న సందులోంచి మలుపు తిరిగారు ఆ సందు మొదట చిన్నగుడి, ఒక పెద్ద మేడ, పెద్దపెద్ద చెట్లు- దాదాపు నిర్మానుష్యంగా ఉన్నట్లుంది.

గబగబా అడుగులు వేయసాగారు ఇద్దరూ. వాళ్ళను నలుదిక్కులనుండీ చీకటి తరుముతూవుంది.

"హల్లో ఫ్రెండ్స్! ఇక్కడ




వున్నాను." గతుక్కు మన్నారు ఇద్దరూ. దగ్గర్లోని మర్రిచెట్టు నీడల్లో ఒక మనిషి జాడ! మాధవరావు పరుగు తీయా లనుకున్నాడు.

"నా దగ్గర రివాల్వరూ, కత్తీ రెండూ వున్నాయి. మర్యాదగా ఇద్దరూ దగ్గరకి రండి," గర్జించింది ఆ కంఠం.

బితుకుబితుకు మంటూ ఇద్దరూ దగ్గరకు వెళ్ళారు.

"నాకు తెలుసు, మీరు పారిపోవడానికి ప్రయత్నిస్తారని. అందుకనే ఒక ప్రక్కన మీ పైన కన్ను వేశాను. వెధవది, దొంగనోట్ల కట్టలు కాబట్టి పోలీసుల బాధ తప్పించుకోవడానికి మీ కిచ్చి ఈ అవస్థ పడ్డాను కాని ఊఁ, కానీయండి, అప్పుడే అయిందనుకున్నారా? నమ్మినందుకు నాకే గొయ్యి తవ్వుతారా!? ఆ రెండు నోట్లకట్టలు, మీ దగ్గరున్న నగలూ అన్నీ అక్కడ పెట్టండి. లేకపోతే చంపేస్తాను. నేనసలే కర్కోటకుడ్ని," పెద్దమనిషి పెద్దపులిలా కనబడ్డాడు.

"నగలను వదిలేయండి సార్! బుద్ధి గడ్డితిని ఇలా చేశాం. ఇక ముందెప్పుడూ ఇలాంటి పనులు చెయ్యంగా;" దొరికిన డబ్బు దొంగనోట్లని వినగానే_తాము వాడికి దొరికిపోవడం మంచి దయిందని ఒక ప్రక్క వున్నా, నగలను లాక్కోంటా నగానే మాధవరావుకు దిగులు పట్టుకొంది _ ప్రాధేయ పడసాగాడు

"నోర్ముయ్. అమ్మాయి! తొందరగా తీసిచ్చేయ్. నాకు కోపం వస్తుంది;'' అతని చేతిలోని కత్తి పైకెత్తి చూపించ

గానే, సుధారాణి సూట్‌కేసులోని రెండు కట్టలూ, తన నగలూ, ఒక్కొక్కటే తీసి అతని ఎడంచేతిలోని జేబురుమా లులో వేసింది. మాధవరావు నిర్వీర్య పోతూ దీనంగా వాటివైపే చూడ సాగాడు.

"...జాగ్రత్త! పదినిమిషాలవరకూ అటువైపే తిరిగి నిలబడండి ఎవరో ఇటు వస్తున్నట్లున్నారు. ఏదైనా గొడవ చేశారా - అందర్నీ కాల్చిపారేస్తాను. నే నసలే మొండివాడ్ని;" రివాల్వరు మొనతో ఇద్దరి వీపులపై నొక్కి గుర్తు చూపించి వెనక్కి తిరిగి చూస్తూ చూస్తూ వేగంగా వెళ్ళిపోయాడు దొంగ వ్యాపారస్థుడు. వాడు దూరంగా వెళ్ళిపోవడం చూసి సుధారాణి ఫకాలున నవ్వింది. నగలన్నీ పోయినా నవ్వుతున్నందుకు ఆశ్చర్యపడుతూ 'ఏమి' టన్నట్లు చూశాడు మాధవరావు మాటలు రాక!

'గిల్టు' నగలన్నీ పట్టుకుపోయాడు వెధవ... ఇంకా గట్టిగా నవ్వసాగింది.

తెల్లబోయాడు మాధవరావు

తనింతవరకూ చెప్పినమాటలు విని ప్లానుతో... కష్టపడింది, చూసి ఆశ పడింది బంగారం తనదే ననుకొని. మోజుగామురిసివచ్చిందీ అంతా ఈ'గిల్టు' అమ్మాయికొరకా -? బుర్ర తిరిగిపోయిన ట్లయింది!

"ఏమిటి అలా చూస్తున్నారు," అంది సుధారాణి.

"హల్లో! మీరిక్కడ ఉన్నారా!" ఇద్దరూ ఉలిక్కి పడి ప్రక్కకు తిరిగారు. సత్రంలోని సేల్సుఏజంటు అతను.

"మీరేనాండీ...! విజయవాడలో ఒక కంపెనీలో పని చేస్తూ వెయ్యి రూపాయలు... సారీ! ఉండండి;" పేపరులో ఫొటో ఒకసారి చూసి," తన చేతిలోని పేపరు పేజీలు బ్యాటరీలైటుతో వెదుకసాగాడు ఏజంటు.

'ఫొటో' చూస్తూ తిరిగి మొహం చూద్దామని తల పేపరులోంచి పైకిఎత్తాడు.

అమాయకంగా తను చెప్పిన పనులు చేస్తూ 'బాడీగార్డులా' ఉంటా డనుకున్న మాధవరావు 'లెదర్‌బాగ్'తో 'మల్కాసింగ్'లా పరుగెత్తడం చూసి, అవాక్కయి నిలుచుంది సుధారాణి

ఇక తానూ పరుగుతీసి పట్టుకోవడానికి ప్రయత్నించడం లాభం లేదని గ్రహించాడు మధ్యవయస్కుడూ, అనుభవజ్ఞుడూ అయిన ఏజంటు

"ఈ పూటకు మీరు సత్రానికేనా వచ్చేది:" సుధారాణి వైపు ఓరగా చూస్తూ వంకరగా నవ్వుతూ అడిగాడు.

ఆమె తల వంచుకొని ఆలోచించ సాగింది.

'రాత్రి' తన 'చీకటిని' చూస్తూ మురిసిపోతూ వుంది. 'చీకటి' 'రాత్రి'ని వెక్కిరిస్తూ వికటాట్టహాసం చేయసాగింది.

---